క్లుప్తంగా

మురుగు సమస్య లేకుండా చూడండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి



తెనాలిఅర్బన్: పట్టణంలో మురుగు సమస్య లేకుండా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 11,14,20 వార్డుల్లో సోమవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతిరోజు చెత్తను సహకరించాలని ఆదేశించారు. ఆయన వెంట కౌన్సిలర్ దేసు యుగంధర్, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు అర్జీలు



తెనాలిఅర్బన్: మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెండు అర్జీలు వచ్చినట్లు మేనేజర్ దేవసేన తెలిపారు. వాటిలో గానుగ నూనె షాపు నుంచి దుర్వాసన వస్తోందని, షాపును తొలగించాలని ఒకరు, చలికాలం నేపథ్యంలో వీధి దీపాలను సాయంత్రం 5.30 గంటలకు వెలిగించే విధంగా చూడాలని మరొకరు అర్జీలు ఇచ్చినట్లు చెప్పారు. వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

యాక్టివిటీ బోధనతో మంచి ఫలితాలు




తెనాలిఅర్బన్: యాక్టివిటీ బేస్ బోధనతో మంచి ఫలితాలు సాధించవచ్చని నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ పేర్కొన్నారు. బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ స్కూల్ ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి సోమవారం పలు నమూనాలను తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. బట్టీపట్టే విధానానికి స్వస్తి పలికి వివిధ నమూనాల ప్రదర్శన ద్వారా విద్యార్థుల్లో జ్ఞానాన్ని పెంపొందించేందుకు తమ పాఠశాల ప్రయత్నిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష దీపోత్సవం



తెనాలిరూరల్: పట్టణ చినరావూరులోని సోమేశ్వరాలయంలో కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని లక్ష దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సూర్యదేవర శివలింగ ప్రసాద్-పద్మావతి, సుఖవాసిరావు-కృష్ణారాధ, శ్రీకాంత్-స్రవంతి దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన కార్యక్రమాన్ని ఆలయ ఈవో హరిబాబు, పూజారి ఈశ్వర్ పర్యవేక్షించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



తెనాలిరూరల్: రైలు నుండి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెదవడ్లపూడి-దుగ్గిరాల స్టేషన్‌ల మధ్య పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని సోమవారం పరిశీలించారు. మృతుడి వయసు 45 నుండి 50 ఏళ్ల మధ్య ఉంటుంది. నిండు చేతుల తెల్ల చొక్కా, కాఫీ పొడి రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. రైలు నుండి జారీ పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు ఎస్ఐ వెంకటాద్రి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

పారిశుద్ధ్యం పడకేసింది!

- వార్డుల్లో కార్మికుల కొరత ఎక్కువగా ఉంది
- చర్యలు తీసుకోవాలంటూ పలువురు కౌన్సిలర్ల వినతి
- ప్రశాంతంగా ముగిసిన అత్యవసర సమావేశం



అధ్యక్షత వహించిన రాధిక



పారిశుద్ధ్య నిర్వహణపై ప్రశ్నిస్తున్న వైస్‌చైర్మన్ నాగవేణి

తెనాలిఅర్బన్: పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ పడకేసింది... వార్డుల్లో సరిపడినంత మంది కార్మికులు లేకపోవటం వల్ల ఎక్కువ శాతం వీధులు అపరిశుభ్రంగా ఉంటున్నాయి.. కార్మికుల సంఖ్య పెంచటంతో పాటు అధికారుల పర్యవేక్షణ పెంచే విధంగా చర్యలు తీసుకోవాలంటూ పలువురు వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్లు కోరారు. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన సోమవారం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే 27వ వార్డు కౌన్సిలర్ బోయపాటి అరుణ లేచి తన వార్డులో కార్మికులను ఎవరికి చెప్పి మార్చారని, ఇలా చేయటం వల్ల పారిశుద్ధ్య నిర్వహణ నిలచిపోతోందని తెలిపారు. ఇంతలో వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి లేచి తన వార్డులో ఉన్న కార్మికులు స్థానికులు కావటం వల్ల ఎవరు పనులు చేయటం లేదని, తన వార్డులోని వారిని ఇతర వార్డులకు మార్చి తన వార్డులో కొత్త వారిని నియమించాలని కోరారు. కౌన్సిలర్ల సూచన మేరకు చర్యలు తీసుకుంటామని ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల హామీ ఇచ్చారు. అలాగే కౌన్సిలర్‌లు తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, ఆవుల కోటయ్య, పసుపులేటి త్రిమూర్తిలు లేచి తమ వార్డులలో పారిశుద్ధ్య కార్మికులు తక్కువ మంది వస్తున్నారని, వారి సంఖ్య పెంచాలని సూచించారు. గ్యాంగ్ వర్కు కోసం నియమించిన వారు కొద్దిసమయం పనిచేసి తర్వాత కాలక్షేపం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు తెలిపారు. వీరివల్ల వార్డులలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగు పడటం లేదని, వీరి స్థానంలో మంచి వారిని కార్మికులకు నియమించి నెలనెల జీతం చెల్లిస్తే చాలా వరకు వార్డులలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడే అవకాశం ఉందని సూచించారు. సూచనను పరిశీలిస్తామని చైర్‌పర్సన్ రాధిక హామీ ఇచ్చారు.

కుక్కల సమస్యకు చెక్ పెట్టండి

తెనాలి పట్టణంలో కుక్కల సమస్య ఎక్కువగా ఉందని, చిన్నపిల్లల్ని, రోడ్లపై వెళ్తున్న వారిని అవి కరుస్తున్నాయని పలువురు కౌన్సిలర్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. వీటి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరారు. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. అనంతరం అజెండాలోని అన్ని అంశాలు ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించి సమావేశాన్ని ముగించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ రాధిక మాట్లాడుతూ అజెండాలోని మొదటి అంశం మినహా మిగిలిన అన్ని అంశాలు ఆమోదించినట్లు తెలిపారు. పట్టణాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సమావేశంలో వైస్ చైర్మన్ మాలేపాటి హరి ప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి, ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు, పలువురు కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మానవీయత బలపడితేనే ఆదర్శ సమాజం



మాట్లాడుతున్న అప్పికట్ల వెంకటేశ్వరరావు

తెనాలి: మానవీయ సంబంధాలు బలపడినప్పుడే సమాజం ఆదర్శవంతంగా నడుస్తుందని, ప్రతిఒక్కరూ ఆత్మీయతను, మానవతను పెంచుకునే దిశగా నడుచుకోవాలని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకారుడు అప్పికట్ల వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణానికి చెందిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నవంబరు నెల సర్వసభ్య సమావేశం ఆదివారం రాత్రి స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సమాజంలో మానవీయ సంబంధాలు నాడు-నేడు అంశంపై అప్పికట్ల వెంకటేశ్వరరావు ప్రసంగించారు. బమ్మెర పోతన రచించిన భాగవతంలోని ముఖ్యమైన పద్యాలను ఉదహరించారు. ప్రస్తుతం మానవులు ఎదుర్కొంటున్న సామాజిక, మానసిక, ఆర్థిక, కుటుంబసమస్యలను తనదైన శైలిలో వివరించారు. కార్యదర్శి పూర్ణచంద్రరావు, ఉపాధ్యక్షుడు కొలసాని వెంకటకోటయ్య, సంయుక్త కార్యదర్శి పుచ్చకాయల కోటిరెడ్డి, కార్యవర్గసభ్యులు అబ్బూరు రామమూర్తి, కుప్పాల లమయ్య, చెరుకూరు శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో విద్యనభ్యసించాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన తహసీల్దార్ గోపాలకృష్ణ, డాక్టర్ శారద

తెనాలిరూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని చేరుకునే విధంగా కష్టపడి చదవాలని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ సూచించారు. అంతర్జాతీయ మహిళలపై హింస నిర్మూలన దినాన్ని పురస్కరించుకుని పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద ఆధ్వర్యంలో బుర్రిపాలెంలోని జెడ్పీ హైస్కూల్లో విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దార్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య నేర్చుకోవడం ద్వారా మెరుగైన సమాజాన్ని ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. డాక్టర్ శారద మాట్లాడుతూ ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్ అండ్ గైనకలాజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు మంచి, చెడు గురించి వివరించే 'ధీర' కార్యక్రమాన్ని తెనాలి నియోజకవర్గంలో బుర్రిపాలెంలో ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలపై హింసకు వ్యతిరేకంగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ



పేదలకు భోజనాలు, నిత్యావసరాలు అందజేస్తున్న దిలీప్‌రాజా

తెనాలిరూరల్: పెంపుడు కుక్క జ్ఞాపకార్థం ఆ కుక్క యజమాని పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేసి ఆహారాన్ని అందించారు. కుక్క బ్రతి ఉన్నన్ని రోజులు తనను ఎంతగా ప్రేమించిందో తన జీవితాంతం ఆ కుక్కను ప్రేమిస్తూనే ఉంటానని యజమాని చెబుతున్నాడు. ఇంతకు ఆ పెంపుడు కుక్క యాజమని వేరెవ్వరో కాదు, తెనాలికి చెందిన సినీ దర్శకుడు దిలీప్ రాజా. తాను పెంచుకున్న కుక్కకు బెట్టిబాబు అని పేరు పెట్టుకుని సాకారు. జీవితంలో తన పెంపుడు కుక్క బెట్టిబాబు ఒక భాగం కాబట్టే మృతదేహాన్ని పారవేయకుండా ఆచార సంప్రదాయాలతో సొంత స్థలంలోనే అంత్యక్రియలను నిర్వహించినట్లు దిలీప్ రాజా తెలిపారు. దానికో సమాధిని కూడా ఏర్పాటు చేస్తానని ఆయన వెల్లడించారు.

టెన్నిస్‌లో విద్యుత్ ఉద్యోగుల ప్రతిభ



తెనాలిరూరల్: ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి 25 వరకు చత్తీస్‌గఢ్‌లో జరిగిన లాన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ ఉద్యోగులు ప్రతిభను చాటారు. ఆంధ్ర తరపున విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ కేవీఎల్ఎన్ మూర్తి, తెనాలిలో లైన్ మ్యాన్‌గా పనిచేస్తున్న కొమరాగిరి మహేష్ పాల్గొన్నారు.ఓపెన్ డబుల్స్ విభాగంలో ద్వితీయ స్థానాన్ని కై వసం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో వీరిని విద్యుత్ శాఖ ఉద్యోగులు అభినందించారు.

జంపనిలో మందులు వితరణ



కిట్‌ల పంపిణీని ప్రారంభించిన అహ్మద్ షరీఫ్

జంపని(వేమూరు): అన్నప్రసాద వితరణతో సహా పలు వితరణలు అందిస్తున్న వేమూరు మండల గ్రామం జంపనిలోని ఆబ్‌స్తా దర్బార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత మూడురోజులుగా నిర్వహిస్తున్న ఉచిత వై ద్యశిబిరం సోమవారం సాయంత్రంతో ముగిసింది. చీమలపాడు ఆశ్రమ గురువు హజరత్ సూఫీ ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ 88వ జయంతి వేడుకల్లో భాగంగా జరిగిన శిబిరంలో గత మూడురోజుల్లో దాదాపుగా రెండువేలమందికి కంటి పరీక్షలు, షుగర్, బీపీ, గుండె సంబంధిత ఎకో, ఈసీజీ పరీక్షలు చేసి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. గుండెపోటు సంభవించినపుడు తొలి గంటలోనే తక్షణం వాడాల్సిన అత్యవసర మందుల కిట్‌ను పదివేల కుటుంబాలకు పంపిణీ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారు జనాబ్ అహ్మద్ షరీఫ్ చేతులమీదుగా ప్రారంభించారు. ఆబ్‌స్తా దర్బార్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, చైర్మన్ అతా ముహమ్మద్ నిజాముద్దీన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సభలో అహ్మద్ షరీఫ్ కూనిశెట్టి శ్రావణ్‌కుమార్, కూనిశెట్టి నాగుల్‌మీరా, షేక్ హనీఫ్, మొసిన్ అహ్మద్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే... ఆస్పత్రికే...!!



గుంతలుపడిన ఫుట్‌పాత్



కాలువేస్తే కిందపడాల్సిందే

- ప్రమాదకరంగా ఓవర్ బ్రిడ్జి ఫుట్ పాత్
- రంధ్రాలు పడి ఏళ్ళు దాటుతున్న పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న పాదచారులు

తెనాలిఅర్బన్: తెనాలి చెంచుపేట వెళ్ళే ప్రధాన రహదారిపై గతంలో ఏర్పాటు చేసిన ఓవర్ బ్రిడ్జి ఫుట్ పాత్ ప్రమాదకరంగా మారింది. ఫుట్ పాత్ టైల్స్ దెబ్బతినటంతో పాటు వాటికి అక్కడక్కడా రంధ్రాలు పడి ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళల్లో దానిపై నడిచే వారు ప్రమాదాలబారిన పడుతున్నారు. తెనాలి నుంచి గుంటూరు వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవటంతో 1960వ సంవత్సరంలో నాటి పాలకులు రైల్వే ఉన్నతాధికారుల అనుమతితో మార్కెట్ నుంచి చెంచుపేట వరకు ఓవర్ బ్రిడ్జిని నిర్మించి దాని నిర్వహణ బాధ్యతను ఆర్‌అండ్‌బీ అధికారులకు అప్పగించారు. దీంతో గుంటూరు వెళ్లటం సులువుగా మారింది. ఓవర్ బ్రిడ్జిపై ప్రతిరోజు సుమారు వెయ్యి ఆటోలు, అయిదు వేల ద్విచక్ర వాహనాలు, వందకు పైగా ఆర్టీసీ, విద్యాసంస్థల బస్సులు తిరుగుతుంటాయి. పాదచారులు ఎక్కువగా ఫుట్ పాత్‌ను ఉపయోగిస్తుంటారు. చెంచుపేటకు వెళ్ళే బ్రిడ్జికి ఇరువైపుల ఫుట్ పాత్‌లు దెబ్బతినటంతో గత పాలకులు దానికి టైల్స్ వేయించి వాటిని అందంగా తీర్చిదిద్దారు. తర్వాత దాని పర్యవేక్షణ మరిచారు. దీంతో ఓవర్ బ్రిడ్జికి ఇరువైపుల అక్కడక్కడ టైల్స్ ఊడిపోవటంతో పాటు రంధ్రాలు పడి ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళల్లో దానిపై వెళ్ళే పాదచారులు వాటిలో పడి గాయపడుతున్నారు. ఇలాగే కొంత కాలం వదిలేసే రంధ్రాలు పెద్దవై వాహనాల రాకపోకలకు అవరోధంగా మారే అవకాశం ఉంది.

ఇప్పటికైన ఆర్‌అండ్ బీ అధికారులు వెంటనే స్పందించి ఫుట్ పాత్‌పై పడిన రంధ్రాలను పూడ్చటంతో పాటు ఊడిన టైల్స్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. ప్రస్తుతం రోడ్ల మరమ్మతులు చేస్తున్నామని ఆర్‌అండ్‌బీ డీఈ రాజేంద్ర తెలిపారు. ఆ పనులు పూర్తి అయిన తర్వాత ఓవర్‌బ్రిడ్జి రిపేర్లకు అవసరమైన ఎస్టిమేషన్‌లు వేసి ఉన్నతాధికారులకు పంపుతామని చెప్పారు.

మరమ్మతులు చేయాలి

ఓవర్ బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌కు అక్కడక్కడ గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. దీనివలన పాదచారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దానిపై ఉదయం కొంతమంది వాకింగ్ చేస్తు ఉంటారు. రాత్రి వేళలో గుంతలు కనపడక అనేక మంది పడి ప్రమాదాలు బారినపడ్డారు. అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌కు మరమ్మతులు చేయించండి.

– పి.వినయ్‌కుమార్, తెనాలి

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

తెనాలిరూరల్: కర్నూలు జిల్లా జి. జంబులదిన్నె గ్రామ రైతు సేవా కేంద్రంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన అగ్రికల్చర్ అసిస్టెంట్ హరినాథ్‌రెడ్డి మృతిపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ స్టేట్ వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీస్ అసోసియేషన్ తెనాలి శాఖ అధ్యక్షుడు మర్రి శేషుబాబు, ప్రధాన కార్యదర్శి పిన్ని రాజ్‌కుమార్, పృథ్వీరాజ్, పినపాడు వీరేంద్రకుమార్ తదితరులు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొన్ని నెలలుగా అధికారులు తీవ్ర ఒత్తిడికి గురి చేయడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. ఇందుకు కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తెనాలిలో 'మహిళా మీ కోసం' వాహనాలు

తెనాలిరూరల్: మహిళలపై హింస నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా గుంటూరులో ఎస్పీ సతీష్‌కుమార్ ప్రారంభించిన మహిళా మీ కోసం కార్యక్రమాన్ని తెనాలి రామకృష్ణ కవి కళా క్షేత్రంలో ప్రత్యేక స్క్రీన్‌ల ద్వార విద్యార్థులు తిలకించే విధంగా పోలీస్ శాఖ సోమవారం ఏర్పాటు చేసింది. మహిళా మీ కోసం కార్యక్రమంలో భాగంగా తెనాలిలో రెండు కార్లు, నాలుగు బైక్‌లు అందుబాటులోకి తీసుకొచ్చారు. రాత్రివేళ మహిళలు ఇబ్బంది పడకూడదనే జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఈ కార్యక్రమాన్ని తీసుకొచినట్లు డీఎస్పీ జనార్ధనరావు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ పరిధిలోని అన్ని స్టేషన్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారికి అవార్డు



తెనాలి: ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలులోని కళామిత్ర మండలి (తెలుగు లోగిలి) 18వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం అక్కడి ఎన్టీఆర్ కళా క్షేత్రంలో వైభవంగా నిర్వహించారు. నూనె వెంకాయమ్మ-వెంకటరత్నం జీవనసాఫల్య పురస్కారాన్ని తెనాలికి చెందిన ప్రముఖ కవి కె.శివారెడ్డికి ప్రదానం చేశారు. ఇదే వేదికపై శివారెడ్డి చేతులమీదుగా వివిధ రంగాల ప్రముఖులను పలు అవార్డులతో సత్కరించారు. వీరిలో పట్టణ నివాసి, తెలుగు క్రైస్తవ సాహిత్య పరిశోధకుడు, దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి ఉన్నారు. ప్రముఖ కవయిత్రి, తొలి స్త్రీవాద/ తొలి గజల్ రచయిత్రి కొలకలూరి స్వరూపరాణి స్మారక అవార్డును కృపాచారికి బహూకరించి సత్కరించారు. స్వరూపరాణి స్వస్థలం బాపట్ల జిల్లా అమృతలూరు మండల గ్రామం గోవాడ. ఉపాధ్యాయ వృత్తిలో పలు ప్రాంతాల్లో పనిచేసి ఒంగోలులో స్థిరపడ్డారు. అక్కడే కన్నుమూశారు.

క్లూస్ టీం ఆధారాల సేకరణ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కోనేరు కట్ట సమీపంలో ఉన్న హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. కాగా దీనిపై ఆరోగ్య సిబ్బంది ఉన్నతాధికారులకు, పోలీసులకు తెలియజేశారు. దీంతో సోమవారం గుంటూరు నుంచి క్లూస్‌టీం ఏఎస్ఐ షేక్ కరిముల్లా, మరో సభ్యుడు వచ్చారు. ప్రమాదం జరిగిన చోట ఆధారాలు కోసం కొన్ని కాలిన వస్తువులను, బూడిదను సేకరించారు. అన్ని ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ ఏఎస్ఐ ఎస్కే. మొహిద్దీన్ సేకరించిన ఆధారాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తారని చెప్పారు.

అయ్యప్పలకు అన్నదానం

ఫిరంగిపురం: వేములూరిపాడు గ్రామంలోని జలపాలేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములకు అన్నదానం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆలయంలో ఈ నెల 18 నుంచి గ్రామస్తులు, భక్తుల సహకారంతో ప్రారంభించిన అన్నదానం 41 రోజుల పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజు మూడు వందల వరకు ఇక్కడకు వస్తున్నారని చెప్పారు.

బాల్య వివాహాల కట్టడి బాధ్యత అందరిది

రావెల(తాడికొండ): బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తహసీల్దారు కె.నాసరయ్య, ఎంపీడీవో కె.సమతా వాణి అన్నారు. రావెల గ్రామంలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల వల్లకలిగే అనర్థాలపై ఆటో ద్వారా ప్రచారోద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలను అరికట్టడంతో బాలికలు అవకాశాలను అందిపుచ్చుకొని అన్ని రంగాల్లో స్వేచ్ఛగా ఎదిగేందుకు దోహదం పడుతుందన్నారు. మహిళల రక్షణకు చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ హెల్ప్ లైన్ 100, టోల్‌ఫ్రీ 112పై అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ రావెల శైలజ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రచారం ప్రారంభించారు.

ధర్నాను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ మంగళవారం దేశ వ్యాప్తంగా 500 కలెక్టరేట్ల వద్ద నిర్వహించనున్న కార్మిక కర్షక ప్రదర్శన ధర్నాలను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. సోమవారం తాడేపల్లిలో రైతాంగాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వ్యవసాయ నల్ల చట్టాలను వెనక్కి తీసుకుంటామని, పంటలకు కనీస మద్దతు ధర చట్టాన్ని తీసుకువస్తామని, విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తామని చెప్పి, రైతు ఉద్యమం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని మండిపడ్డారు. ఈ ప్రచార కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, డి.విజయ భాస్కర్‌రెడ్డి, సీఐటీయూ నాయకులు బి. వెంకటేశ్వరరావు, బర్న బాస్, జి. శ్రీను పాల్గొన్నారు.